చిలుకూరు బాలాజీ ఆలయంలో మహాప్రదక్షిణలు

మొయినాబాద్, ఆగస్టు 10: చిలుకూరు బాలాజీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు తరలివచ్చారు. శుక్ర, శని, ఆదివారాల్లో ఆలయం లోపల ప్రదక్షిణలకు అనుమతించకపోవడంతో భక్తులు ఆలయం బయట మహాప్రదక్షిణలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. భక్తుల కొంగుబంగారంగా భాసిల్లుతున్న చిలుకూరు బాలాజీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే మోక్షం లభిస్తుందని ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ అన్నారు.





అయ్యో పాపం.. అందని జీతం

ఆశగా ఎదురు చూస్తున్నాం



నేను 11 సంవత్సరాల నుంచి చేవెళ్ల మోడల్ స్కూల్‌లో గణితం టీచర్‌గా పని చేస్తున్నాను. ఇప్పటి వరకు ఎప్పుడూ జీతాలు ఇలా ఆగలేదు. ఈసారి మూడు నెలలు అవుతున్నా వేతనాలు రాలేదు. ఈఎంఐలు, హౌస్ రెంట్లు కట్టుకునేందుకు ఇబ్బందిగా మారింది. సీఎం రేవంత్‌డ్డి స్పందించి త్వరగా జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలి.

- అనంత, టీజీటీ, చేవెళ్ల మోడల్ స్కూల్

ఒకటో తేదీన రావాల్సిన జీతం రెండు రోజులు ఆలస్యమైతేనే కుటుంబాన్ని నడపడం కత్తిమీద సాములాగా మారుతుంది. అటువంటిది నెలలుగా జీతాలు రాకపోతే ఆ పరిస్థితి చెప్పనక్కర్లేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి అదే. బ్యాంకు, హౌసింగ్ రుణాలు, ఈఎంఐలను ఎలా చెల్లించాలో తెలియక నానా అవస్థలు పడుతున్నారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి 5 నెలలు, హాస్టల్ సిబ్బందికి 4 నెలలు, రెగ్యులర్ టీచర్లకు, అవర్ బేస్డ్ టీచర్లకు 3 నెలలుగా వేతనాలు అందలేదు. మొత్తం 18 మోడల్' స్కూళలో 500 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు.

- ఐదు నెలలుగా తప్పని ఎదురుచూపులు
- కుటుంబాలు గడవడం లేదని ఆందోళన
- 010 పద్దు ద్వారా 1వ తేదీనే ఇవ్వాలని డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో 18 మోడల్' స్కూళ్లు
- 500 మంది బోధన, బోధనేతర సిబ్బంది

వేతనాలు రాక 'మోడల్' టీచర్ల నిరీక్షణ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 10):

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో మొత్తం 18 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. అందులో 500 మందికిపైగా బోధన, బోధనేతర సిబ్బంది పని చేస్తున్నారు. అందులో 224 మంది రెగ్యులర్ ఉపాధ్యాయులు, 80 మంది అవర్‌బేస్డ్, 72 మంది అవుట్ సోర్సింగ్, 36 మంది ఒకేషనల్ టీచర్లు పనిచేస్తున్నారు. దీంతో పాటు హాస్టల్స్‌లో మరో 90 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్, శంకర్‌పల్లి, మహేశ్వరం, వికారాబాద్ జిల్లా పరిగి, వికారాబాద్, పెద్దెముల్ మండలాల్లోని మోడల్ స్కూల్స్ మొత్తంగా అవర్‌బేస్డ్ టీచర్లతో కొనసాగుతున్నాయి. మిగితా 14 మోడల్ స్కూల్స్‌లో రెగ్యులర్ ఉపాధ్యాయులతో కొనసాగుతున్నాయి. ఔట్ సోర్సింగ్ సిబ్బంది, హాస్టల్ సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారు. రెగ్యులర్ టీచర్లతో పాటు అవర్ బేస్డ్ టీచర్లకు 3 నెలలుగా, రెగ్యులర్ ఉపాధ్యాయులకూ సకాలంలో వేతనాలు అందకపోవడంతో వారి కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రెజరీల ద్వారా 010 పద్దు నుంచి వేతనాలు ఇవ్వాలని ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం వాపోతున్నారు. అలా ఇవ్వకపోవడం వలన ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఆర్థిక శాఖ నుంచి ఆమోదం పొందాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 010 పద్దు ద్వారా ప్రతీ నెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని కోరుతున్నారు. దీనికి తోడు 11 సంవత్సరాల నుంచి బదిలీలు లేక ఒకే చోట విధులు నిర్వహిస్తున్నామని, వెంటనే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

నెలనెలా వేతనం వస్తేనే కుటుంబం గడిచేది. అలాంటిది నెలలకొద్దీ వేతనాలు రాకుంటే ఎలా అని మోడల్ స్కూల్ ఇంటర్ హాస్టల్ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 18 మోడల్ స్కూల్స్ ఉన్నాయి. ఇక్కడ చదువుకుంటున్న ఇంటర్ విద్యార్థినులకు పక్కనే వసతి గృహాన్ని ఏర్పాటు చేసింది. ఒక్కో మోడల్ హాస్టల్‌లో వంద మంది విద్యార్థినులు ఉంటున్నారు. రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల, షాబాద్, ఇబ్రహీంపట్నం పరిధిలోని బొంగలూరు, శంషాబాద్ మండలంలోని పాల్మాకుల, చాచారం పరిధిలోని గున్‌గల్, మహేశ్వరం, మంచాల పరిధిలోని ఆరుట్ల, కందుకూరు, శంకర్‌పల్లిలో మోడల్ స్కూల్స్ కొనసాగుతున్నాయి. శంకర్‌పల్లి మినహా అన్ని మండలాల్లో ఇంటర్ విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం కల్పించారు. అలాగే వికారాబాద్ జిల్లాలో పూడూరు మండలం ఎన్కేపల్లి, తాండూరులోని జిన్‌గుర్తి, పరిగిలోని జార్‌పల్లి, కుల్కచర్ల పరిధిలోని ముజాయత్‌పూర్, నవాబుపేట, మర్పల్లిలో మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఒక్కో మోడల్ హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థినుల బాగోగులు చూసుకునేందుకు వార్డన్/కేర్ టేకర్ ఉంటుంది. వార్డెన్‌కు/కేర్ టేకర్‌కు నెలకు రూ. 12,500 చొప్పున వేతనాలు ఇస్తున్నారు. వీరికి నాలుగు నెలల వేతనం రావాల్సి ఉంది. అలాగే వాచ్‌మెన్‌కు రూ.8,710, ఏఎన్ఎంకు రూ.7,800, హెడ్ కుక్‌కు రూ.7,800, ఇద్దరు అసిస్టెంట్ కుక్‌లు ఒకొక్కరికి రూ.6,500 చొప్పున నాలుగు నెలలకు సంబంధించి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.

వెంటనే వేతనాలు ఇవ్వాలి



ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, ఏజెన్సీల తప్పిదంతో ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఐదు నెలలుగా వేతనాలు అందడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి వేతనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలి

-ఆంజనేయులు, మోడల్ స్కూల్ పీడీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

అప్పులు చేయాల్సిన పరిస్థితి



మూడు నెలలుగా మాకు వేతనాలు అందలేదు. ప్రభుత్వం 1వ తేదీన జీతాలు ఇస్తుందని ఆశించాం. కానీ.. ఇంత వరకు అందకపోవడంతో ఇంటి అవసరాలకు సైతం అప్పులు చేయాలల్సిన పరిస్థితి. ఉపాధ్యాయుల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే జీతాలు చెల్లించాలి.

- అశోక్ హిందీ టీచర్, శంకర్‌పల్లి స్కూల్

ఒకటో తేదీనే వేతనాలివ్వాలి



ఇప్పటికైనా వెంటనే జీతాలు ఇవ్వాలి. నాలుగు నెలలుగా ఎదురుచూస్తున్నాం. ఇంటి అవసరాలకు బయట అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇచ్చే చాలీ చాలని జీతాన్ని కనీసం ప్రతి నెలా ఒకటో తేదీన ఇవ్వాలి. వార్డన్లకు జీతాలు పెంచాలి. సీఎం స్పందించి త్వరగా జీతాలు ఇవ్వాలి.

- విజయలక్ష్మి, వార్డన్/కేర్ టేకర్, చేవెళ్ల స్కూల్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆలోచన, జీవన విధానంలో
మార్పు రావాలి

- కల్వకుర్తి అభివృద్ధికి తోడ్పాటునందిస్తా
- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- దేవుడి పడకల్ స్వాగత తోరణం ప్రారంభం

తలకొండపల్లి, ఆగస్టు 10: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల ఆలోచన, జీవన విధానంలో మార్పు రావాలని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వ్యక్తి ఆలోచన, నడవడిక, కార్యశీలతను బట్టే ఎదుగుదల ఉంటుందని ఆయన అన్నారు. తలకొండపల్లి మండలం దేవునిపడకల్ గేటు వద్ద కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి తన తండ్రి రాంరెడ్డి జ్ఞాపకార్థం రూ.25లక్షలతో నిర్మించిన గ్రామ స్వాగత తోరణాన్ని శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి మంత్రి జూపల్లి ప్రారంభించారు. అనంతరం దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మంత్రి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు పూర్ణకుంభంతో జూపల్లికి స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎదుగుదలలో పడి ప్రజల జీవన, ఆలోచనా విధానం లోపిస్తుందని, తద్వారా నేటికీ ఆత్మహత్యలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలను ఎన్నికలు, ఓట్ల వరకే పరిమితం చేసి అభివృద్ధి విషయంలో అందరు ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వపరంగా తనవంతు తోడ్పాటునందిస్తానని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. గతంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో తోడ్పాటునందించానని ప్రస్తుతం హామీలు ఇవ్వకుండా అభివృద్ధి చేసి చూపుతానని కృష్ణారావు చెప్పారు. ఈ సందర్భంగా డోకూరి ప్రభాకర్‌రెడ్డి-సునీత దంపతులను మంత్రి అభినందించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం, నాయకులు భగవాన్‌రెడ్డి, బీక్యనాయక్, యాట నర్సింహ, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో..

విమానయాన రంగం అభివృద్ధికి కృషి

- విమానాశ్రయాల్లో ప్రపంచ స్థాయి హై సెక్యూరిటీ విధానానికి కార్యాచరణ
- ప్రధాని పిలుపు మేరకు ఇంటికో మొక్కను నాటాలి
- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు
- జీఎంఆర్ ఎరీనాలో 10కే రన్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి



జీఎంఆర్ ఎరీనాలో 10కే రన్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 10: రెండు తెలుగు రాష్ట్రాల్లో విమానయాన రంగం అభివృద్ధికి కృషి చేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆగస్టు 5-11 వరకు బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏవియేషన్ కల్చర్ వీక్‌లో భాగంగా శనివారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని జీఎంఆర్ ఎరీనాలో 10కే రన్‌ను జీఎంఆర్ అధికారులతో కలిసి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. అంతకుముందు కేంద్రమంత్రికి జీఎంఆర్ సీఈవో ప్రదీప్ ఫణీకర్ పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటి కార్యక్రమం ఇదే కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు (శంషాబాద్ ఎయిర్‌పోర్టు) నేడు ప్రపంచంలోనే అతిపెద్ద ఎయిర్ పోర్టుల్లో ఒకటని, అందుకు కారణం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడని తెలిపారు. ఆయన ముందుచూపుతో నేడు వేలాది మందికి ఉద్యోగావకాశలు దక్కాయని చెప్పారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వేలాది ఎకరాలు భూమి ఎందుకని ఆనాడు కొందరు ప్రశ్నించారని, దూరదృష్టితో నేడు జీఎంఆర్ ఎయిర్‌పోర్టు ఎంతో అభివృద్ధి చెందుతోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. దేశంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్టు నాలుగో అతిపెద్ద విమానాశ్రయంగా పేరుగాంచిందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను త్వరగా పూర్తి చేయడానికి యత్నిస్తున్నామని, త్వరలోనే అధికారులతో సమావేశం అవుతానని చెప్పారు. మరో రెండేళ్లలో విమానాశ్రయ పనులు పూర్తి చేస్తామని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడెక్కడ విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలి? ఎక్కడ ప్రజా రవాణాకు అవకాశం ఎక్కువ ఉంది? ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనుకూలమైన భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో ఆరా తీస్తున్నామని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతీ ఒక్కరు ఇంటికో మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. మనం ప్రకృతిని కాపాడుతేనే అది మనల్ని కాపాడుతోందని చెప్పారు. ప్రతీ వ్యక్తి తల్లిని ఎలా ప్రేమిస్తాడో ప్రకృతిని కూడా ప్రేమించాలని తెలిపారు. నరేంద్రమోదీ 80 వేల కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారని, దేశ ప్రజలందరూ సహకరించాలని కోరారు. దేశంలోని విమానాశ్రయాల్లోని ప్రపంచ స్థాయి భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. సివిల్ ఏవియేషన్ కల్చర్ వీక్ నిర్వాహకులను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అభినందించారని గుర్తుచేశారు. విమానాశ్రయాల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి ప్రయాణికులు సహకరించాలని, పాజిటివ్‌గా ఆలోచించాలని సూచించారు. భద్రతా పరమైన నిబంధనలకు ప్రయాణికులు కట్టుబడి ఉండాలన్నారు. జీఎంఆర్ ఎయిర్‌పోర్టు నేడు ఈ స్థాయికి రాగలిగిందంటే సిబ్బందితో పాటు సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ వంటి సెక్యూరిటీ సిబ్బందే కారణమని చెప్పారు. అదేవిధంగా సెక్యూరిటీ సిబ్బంది గానీ, ఎయిర్‌పోర్టు అధికారులు గానీ ప్రయాణికులకు అవసరమైన అంశాలపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి మనిషి జీవితంలో వ్యాయామం తప్పనిసరి అని చెప్పారు. తెలంగాణలో మరో ఎయిర్ పోర్టు నిర్మాణానికి కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, త్వరలోనే దానిపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. దేశంలో విమానాశ్రయాల అభివృద్ధి, భద్రతపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. సివిల్ ఏవియేషన్ కల్చర్ వీక్‌లో దేశంలోని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే పాల్గొంటున్నారని తెలిపారు. జీఎంఆర్ సీఈవో ప్రదీప్ ఫణికర్ మాట్లాడుతూ 10కే రన్‌లో భాగంగా జీఎంఆర్ ఎరీనాలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పకుండా చేయాలని చెప్పారు. అలాగే ప్రతీ ఏడాది జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారుల ఆధ్వర్యంలో 10కే, 5కే రన్ నిర్వహిస్తామని చెప్పారు. ప్రతీ వ్యక్తి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కోరారు. ముమ్ముందు జీఎంఆర్ విమానాశ్రయాన్ని ప్రపంచంలోనే నెంబర్‌వన్ ఎయిర్‌పోర్టుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రారంభించిన నాటి నుంచి నేటివరకు విమానాశ్రయం ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు అందించడమే జీఎంఆర్ లక్ష్యమని చెప్పారు. 10కే రన్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఔత్సాహికులు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్, జీఎంఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల విషయంలో **రాజీపడొద్దు**

రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు

-7లో

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా



సీపీఐ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న అజీజ్ పాషా

శంషాబాద్, ఆగస్టు 10 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కంటక విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కౌన్సిల్ సమావేశం శనివారం సాయంత్రం శంషాబాద్‌లో జరిగింది. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అజీజ్ పాషాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగాయన్నారు. కార్పొరేట్లకు పెద్దపీట వేసి నిరుపేదలను నట్టేట ముంచుతున్నారన్నారు. దోపిడీ, అవినీతి పెట్రేగిపోతున్నదన్నారు. పేదలను దోచి పెద్దలకు పెడుతున్న నరేంద్రమోదీ విధానాలను ప్రజాపోరాటాల ద్వారా తిప్పికొట్టకపోతే దేశానికి భవిష్యత్తు ఉండదన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, పానుగంటి పర్వతాలు, పుస్తకాల నర్సింగ్‌రావు, ఎం.యాదిరెడ్డి, కావలి నర్సింహ, ఒ.యాదయ్య. రామస్వామి, టీ.రామకృష్ణ, పబ్బతి లక్ష్మణ్, ప్రభులింగం, ఎం.శ్రీను, బుద్దుల జంగయ్య, బాలరాజు, ఎం.యాదగిరి, నీలమ్మ, నర్రా గిరి, వనం జైపాల్‌రెడ్డి, దత్తునాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు బంద్ సంపూర్ణం

తాండూరు, ఆగస్టు 10: బంగ్లాదేశ్‌లో హిందువులపై కొనసాగుతున్న దాడులకు నిరసనగా శనివారం తాండూరు బంద్‌ను నిర్వహించారు. తాండూరు ఐక్యవేదిక పిలుపు మేరకు వ్యాపార, వాణిజ్య సముదాయాలతో పాటు చిన్న, చిన్న దుకాణాలు, హోటల్స్‌ను స్వచ్ఛందంగా మూసివేసి సంఘీభావం తెలిపారు. పట్టణంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీలో హిందువులు, వ్యాపారులు కదిలివచ్చి భారీ నిరసన ర్యాలీని నిర్వహించారు. నెహ్రూ గంజ్ ఎల్లమ్మ ఆలయం నుంచి శాంతియుత నిరసన ర్యాలీని పురవీధుల్లో నిర్వహించి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. సేవ్ హిందుస్తాన్ ఇన్ బంగ్లాదేశ్ బ్యానర్‌ను ప్రదర్శిస్తూ హిందు బంధువులు కదం తొక్కారు. ర్యాలీ అనంతరం ఇందిరాచౌక్‌లో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం డీఎస్పీ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖాపురం అంజనేయులు, యు.రమేష్‌కుమార్, రజనీకాంత్, నాగారం మల్లేశం, మంకాల రాఘవేందర్, సుదర్శన్‌గౌడ్, బంటారం భద్రేశ్వర్, తర్లపల్లి భానుకుమార్, పర్యాద రామకృష్ణ, అంతారం కిరణ్, బంటారం భద్రేశ్వర్, అలంపల్లి శ్రీనివాస్, వ్యాపార, వాణిజ్య ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



తాండూరులో భారీ నిరసన ర్యాలీ

పామిడోస్ గేటెడ్ కమ్యూనిటీలో

చెట్ల నరికివేత

మేడ్చల్ టౌన్, ఆగస్టు 10: ఒకవైపు స్వచ్ఛదనం-పచ్చదనం అంటూ ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టగా మరో వైపు కొందరు తమ ఇళ్ల ముందు చల్లని నీడనిచ్చే పచ్చని చెట్లను నరికేస్తున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సంపన్నుల కాలనీగా చెప్పుకునే పామిడోస్ విల్లాస్‌లో కొందరు గుట్టుచప్పుడు కాకుండా తమ ఇళ్ల ముందు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పచ్చటి చెట్లను శనివారం తొలగించారు. సుమారు 15 సంవత్సరాల కిందట ఇళ్ల ముందు నాటిన మొక్కలు ప్రస్తుతం వృక్షాలుగా పెరిగాయి. వాటిని తొలగించటం పట్ల కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఈ విల్లావాసులు క్రమశిక్షణలో ఇతర గేటేడ్ కమ్యూనిటీ వాసులకు ఆదర్శంగా ఉంటారు. అలాంటిది పచ్చని చెట్లను తొలగించటం పట్ల స్థానికులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. చెట్ల నరికివేత విషయం తెలుసుకున్న స్థానికులు అడ్డుకోవడానికి మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడ ఉన్న సెక్యూరిటీ గార్డులు మున్సిపల్ సిబ్బందిని లోపలికి అనుమతించలేదు. అనంతరం ఎలాగోలా వీల్లాలోపలికి ప్రవేశించి చూడగా అప్పటికే 15-20 చెట్లను నరికేశారు. చెట్లనుంచి కొమ్మలు వేరు చేసి పెద్ద పాటి భాగాలను తరలించడానికి సిద్ధం చేసి ఉంచారు. ఈ గేటెడ్ కమ్యూనిటీలో దాదాపు 200కు పైగా ఇళ్లు ఉన్నాయి. కాలనీ లోపలికి ఇతరులకు ప్రవేశం పూర్తిగా నిషేధించారు. ఎవరైనా లోపలికి ప్రవేశించాలనుకుంటే ముందుగా కాలనీవాసుల అనుమతి పొంది లోపలికి రావాలి. ఇక చెత్త సేకరించడానికి వచ్చే మున్సిపల్ సిబ్బంది కూడా గేటెడ్ కమ్యూనిటీ వారు నిర్ధారించిన సమయానికి లోపల ప్రవేశించి చెత్తసేకరించుకుని బయటకు రావాలి. ఇలాంటి పరిస్థితుల్లో లోపల ఏంజరుగుతుందో బయటి ప్రపంచానికి తెలియని పరిస్థితి. మున్సిపల్ సిబ్బంది చెట్ల నరికివేత గురించి ఆరాతీయగా సమాధానం చెప్పేవారు లేకపోవటంతో వారు ఫొటోలను తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. అయినప్పటికీ రెండవ శనివారం కావటంతో మున్సిపల్ కార్యాలయానికి సెలవు ఉండి స్పందించే నాథుడు కరువయ్యారు. కాగా పెద్ద చెట్లు ఇబ్బందికరంగా మారటంతో వాటిని తొలగించి వాటిస్థానంలో చిన్నపాటి అలంకరణ మొక్కలు నాటుకోవడానికి కొందరు చెట్లను నరికించినట్లు తెలిసింది.

నా దృష్టికి రాలేదు

పామిడోస్ గేటెడ్ కమ్యూనిటీలో చెట్ల తొలగింపు విషయం నా దృష్టికి రాలేదు. రెండవ శనివారం కావటంతో మున్సిపల్ కార్యాలయానికి సెలవు ఉండటంతో అదను చూసి చెట్ల నరికివేత చేపట్టినట్లు తెలుస్తోంది. చెట్లు నరకడం చట్టపరంగా నేరం. ఒక వేళ అనుమతి లేకుండా చెట్లు నరికితే విచారణ జరుపుతాం.

- స్వామి, మున్సిపల్ కమిషనర్


పామిడోస్ గేటెడ్ కమ్యూనిటీలో నరికేసిన చెట్లు



రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బాదాం శ్రీనివాస్

పరిగి, ఆగస్టు 10: పరిగి పట్టణానికి చెందిన బాదాం శ్రీనివాస్ రైస్ మిల్లర్స్ అసోసియేసన్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. రైస్ మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు.

కొత్త రుణాలు మంజూరులో జాప్యం

కులకచర్ల, ఆగస్టు 10: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడం లేదనే చందంగా ఉంది బ్యాంకు అధికారుల పని తీరు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణాలను ఇప్పటి వరకు రెండు విడతలుగా రూ.1.50 లక్షలలోపు వారికి మాఫీ చేసింది. కాగా బ్యాంకు అధికారులు రుణమాఫీ అయిన రైతులకు తిరిగి వెంటనే రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ రైతులకు నూతన రుణాలు అందించడంలో బ్యాంకు అధికారులు తీవ్ర జాప్యం వహిస్తున్నారు. నూతన రుణాలు ఇచ్చేందుకు రైతులను బ్యాంకుల చుట్టూ తిప్పించుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కులకచర్ల ఉమ్మడి మండల వ్యాప్తంగా కులకచర్ల, ముజాహిద్‌పూర్, చౌడాపూర్‌లలో తెలంగాణ గ్రామీణ బ్యాంకులు, కులకచర్ల, మరికల్‌లో ఎస్‌బీలు, కులకచర్లలో సహకార బ్యాంకులు ఉన్నాయి. వీటి ద్వారా దాదాపు 10వేలకుపైగా రైతులు రుణాలు పొందారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.1లక్ష లోపు రుణాలు 2003 మందికి మాఫీ అయ్యాయి. రెండు విడతలుగా రూ.45.04కోట్లు మాఫీ జరిగింది. రుణ మాఫీ రాలేదని ఇప్పటి వరకు 500మంది రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదేంటని పలువురు రైతులు, ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తే అతిత్వరలో రుణాలు అందిస్తామని బ్యాంకు అధకారులు చెబుతున్నారు. రుణాలు ఇవ్వకపోవడంతో పంటలసాగుకు ప్రైవేట్ వ్యక్తుల దగ్గర అప్పు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని నూతన రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కూల్చేశారు..
కంచె వేయడం మరిచారు



ప్రభుత్వస్థలంలో రియల్టర్లు వేసిన సీసీరోడ్డును తొలగించిన రెవెన్యూ అధికారులు(ఫైల్)

తాత్కాలిక చర్యలతో సరిపెట్టుకున్న రెవెన్యూ అధికారులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 9: ప్రభుత్వ స్థలాలను రక్షించడానికి ఒక వైపు రాష్ట్రప్రభుత్వం కొత్త చట్టాలను అమల్లోకి తీసుకొస్తుండగా మరో వైపు అధికారుల ఉదాసీనత కారణంగా కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేసే ప్రయత్నంలో ఉన్నారు.నగర శివారు ప్రాంతంలోని మేడ్చల్ పట్టణంలో గజం జాగ కొనడం గగనంగా మారిన పరిస్థితుల్లో రియల్టర్లకు చట్టాలు చుట్టాలుగా మారాయనే విధంగా కొన్ని ఘటనలు నిరూపిస్తున్నాయి. ఇటీవల మేడ్చల్ పట్టణంలో ఓ వెంచర్ కోసం రియల్టర్లు ప్రభుత్వ స్థలంలో వేసిన సీసీరోడ్డు ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. సమయానికి కలెక్టర్ స్పందించకపోతే రియల్టర్లు ప్రభుత్వస్థలం లోపలి నుంచి దర్జాగా రోడ్డు వేసుకునేవారు. ఈ ఘటనతో స్థానికంగా చర్చనీయాంశమైంది. అధికారులు ప్రభుత్వ స్థలంలో నిర్మించిన సీసీరోడ్డును తొలగించినప్పటికీ కంచె వేసి స్థలం రక్షణకు చర్యలు చేపట్టక పోవటంతో అధికారుల తీరుపట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సర్వేనెంబర్ 145లోని రెండెకరాల 18గుంటల స్థలానికి అధికారులు కంచె ఏర్పాటుచేసి రక్షణ కల్పించాలంటూ స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమిని అలాగే వదిలేస్తే రియల్టర్లు మళ్లీ కబ్జా చేసే అవకాశాలున్నాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 70-80 అడుగుల పొడవున మేడ్చల్-కిష్టాపూర్ రోడ్డుకు, ప్రైవేట్ వెంచర్‌కు ఆనుకుని మధ్యన ఉన్న రెండెకరాల 18గుంటల ప్రభుత్వ స్థలంలో 14గుంటలను గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు కేటాయించారు. కాగా అగ్నిమాపక దళం వారు స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకోకుండా వదిలేశారు. దీంతో రోడ్డుకు వెంచర్‌కు మధ్య ఈ ప్రభుత్వ భూమి పడావు భూమిగా మారి చివరికి రియల్టర్లు వెంచర్ కోసం రోడ్డు వేసేవరకూ వెళ్లింది.



లేఅవుట్ మ్యాప్‌లో వెంచర్ ముందు చూపెడుతున్న ప్రభుత్వ స్థలం

రెండు వెంచర్లకు దారేది?

సర్వేనెంబర్ 145లోని 2.18గుంటల ప్రభుత్వ స్థలానికి అనుకుని ఉన్న సర్వేనెంబర్ 139, 143, 144లో రెండెకరాల 39 గుంటల్లో దాదాపు 42 పాట్లతో పంచాయతీ ద్వారా 2006లో అనుమతి పొందిన లేఅవుట్‌ను తయారుచేసి ప్లాట్లుగా విక్రయించారు. 2023లో ఇదే (పంచాయతీ లేఅవుట్) రోడ్లను లింక్ చేస్తూ సర్వేనెంబర్ 138, 140, 141లో దాదాపు 33 ప్లాట్లతో మరో హెచ్‌ఎండీఏ వెంచర్‌ను తయారు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ రెండు వెంచర్లకు అప్రోచింగ్ రోడ్డు ఎక్కడి నుంచి ఉన్నదనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం ఈ రెండు వెంచర్లకు అప్రోచింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వ స్థలం నుంచి కొంతవరకు స్థలాన్ని కొలాలి. లేదంటే చుట్టు పక్కన ఉన్న ప్రైవేట్ స్థలాలను కొని రోడ్డును ఏర్పాటు చేసుకోవాలి. ఇలాంటి పరిస్థితుల్లో వెంచర్లకు రియల్టర్లు అప్రోచింగ్ రోడ్డును ఎలా సమకూర్చి ఇస్తారన్నదే చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి



ప్రజలకోసం ఉపయోగపడే ప్రభుత్వస్థలాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రభుత్వ స్థలాలను రక్షణ లేకుండా వదిలేస్తే ప్రైవేటు వ్యక్తులు వాటిని కబ్జాచేసి రోడ్లు వేస్తున్నారు. చివరికి నిర్మాణాలు చేపడుతారు. సర్వేచేయించి సర్వే నెంబర్ 2.39గుంటల స్థలాన్ని సర్వేచేసి కంచె ఏర్పాటు చేయాలి. - జంగ హరికృష్ణ, కౌన్సిలర్

అధికారుల ఉదాసీనతకు నిదర్శనం



ప్రజలకు అవసరమయ్యే ప్రభుత్వ భూములను కబ్జాచేసి దర్జాగా రోడ్లు ఏర్పాటు చేసే పరిస్థితి దాపరించడం అధికారుల ఉదాసీనతక నిదర్శనం. క లెక్టర్‌కు ఫిర్యాదు చేసేంత వరకు స్థాని క అధికారులు పట్టించుకోకపోవడం వారి పనితీరు పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీసీ రోడ్డును తొలగించడం కాదు. వెంటనే కంచె ఏర్పాటు చేసిప్రభుత్వ స్థలంగా బోర్డు ఏర్పాటు చేయాలి. - జాకట ప్రేమ్ దాస్, బీజేపీ మేడ్చల్ పట్టణ ప్రధాన కార్యదర్శి

అంగుళం జాగనూ వదలం



ప్రభుత్వ స్థలం నుంచి అంగుళం జాగ కూడా వదలి పెట్టం. ప్రభుత్వ స్థలాలను కాపాడే విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. రోడ్డు వేసిన వారిపై చర్యలు కఠినంగా ఉంటాయి. రియల్టర్లు వేసిన రోడ్డును తొలగించాం. సమగ్రంగా సర్వే నిర్వహించి సర్వే నెంబర్ 145లోని ప్రభుత్వ స్థలానికి కంచె ఏర్పాటు చేస్తాం. ఒక వేళ ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేసిన, పాట్ల హద్దులు ఏర్పాటు చేసినా వాటిని తొలగించి సదరు వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. - శైలజ, తహసీల్దార్, మేడ్చల్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్


రాష్ట్రంలో అరాచక పాలన

బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

కేశంపేట, ఆగస్టు 10: రాష్ట్రంలో అరాచక పాలన కొన సాగుతోందని బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం రాజేంద్ర నగర్ పరిధిలోని శివరాంపల్లి చెరువులో అక్రమ నిర్మాణాలను హైడ్రా ఆధ్వర్యంలో తొలగించే కార్యక్రమం చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముబీన్ పనులను అడ్డుకునేందుకు అక్కడి వెళ్లారు. దాంతో ఆయన్ను పోలీసులు అదుపులోకి తీసుకుని ఉదయం 10.30 గంటలకు కేశంపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకవచ్చారు. సాయంత్రం 4.30 గంటలకు శంషాబాద్‌కు తరలించే క్రమంలో మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, తెలంగాణలో యోగీ ఆదిత్యనాథ్ తరహా ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నడిపిస్తోందన్నారు. చెరువుల్లో ఇళ్లు కట్టుకుంటున్నప్పుడు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఎక్కడిపోయారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలం అయితే నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను ఎలా కూల్చివేస్తారని అన్నారు. కాగా, ఎమ్మెల్యేను కేశంపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకవచ్చారని తెలిసి కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినొద్దీన్ తన అనుచరులతో కేశంపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆయనతో మాట్లాడారు. అనంతరం ఆయన్ను బందోబస్తు మధ్య శంషాబాద్‌కు తరలించినట్లు కేశంపేట పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుడికి సినారె సాహిత్య పురస్కారం ప్రదానం


పెద్దేముల్, ఆగస్టు 10: ఉపాధ్యాయుడు ద్యావరి నరేందర్‌రెడ్డికి సినారే సాహిత్య పురస్కారం లభించింది. మండల కేంద్రానికి చెందిన ద్యావరి నరేందర్‌రెడ్డి పెద్దేముల్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆంగ్ల బోధన చేస్తున్నారు. అయితే ఆయన కవిత్వమంతా తెలుగులోనే ఉంటుంది. తెలుగులో ఆయన గజల్స్ రాస్తుంటారు. తెలుగు సినిమాలో పాటలూ రాశారు. అయితే ఆయన తెలుగు సాహిత్యంలోని గజల్ ప్రక్రియలో రెండు దశాబ్దాల నుంచి విశేష కృషి చేస్తున్నందున ఆయనను సినారే సాహిత్య పురస్కారం 2024 వరించింది. హైదరాబాద్‌కు చెందిన మహాకవి సినారె కళా పీఠం సంస్థ డాక్టర్ సి.నారాయణరెడ్డి 93వ జన్మదినం సందర్భంగా సాహిత్య పురస్కారాలను అందజేశారు. హైదరాబాద్‌లోని తుర్కయాంజల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నందిని సిధారెడ్డి చేతులమీదుగా ద్యావరి నరేందర్‌రెడ్డికి ఈఅవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో మహాకవి సినారె కళాపీఠం అధ్యక్షుడు మల్లెకేడి రాములు, తేజసాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి అధ్యక్షుడు డాక్టర్ గంటా జలందర్‌రెడ్డి, తుర్కయాంజల్ మున్సిపల్ కౌన్సిలర్ సునీల్, రెండు తెలుగురాష్ట్రాల ప్రముఖ కవులు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు. ద్యావరినరేందర్ రెడ్డి సినారే సాహిత్య పురస్కారం అందుకోవడం పట్ల తాండూరు కళాభారతి సాహిత్య వేదిక అధ్యక్షుడు రామకృష్ణరాజు, ప్రధానకార్యదర్శి బాకారాం జయపాల్‌రెడ్డి, కవులు సిద్దిలింగయ్య, కోటం చంద్రశేఖర్, గాజుల పవన్‌కుమార్, పెరుమాళ్ళ వెంకట్‌రెడ్డి, జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు సునీత, తోటి ఉపాధ్యాయులు, వికారాబాద్ జిల్లా గెజిటెడ్ లెక్చరర్స్ సంఘం అధ్యక్షుడు టి.మహేందర్‌లు హర్షం వ్యక్తం చేశారు.



సినారె సాహిత్య పురస్కారం అందుకుంటున్న ద్యావరి నరేందర్‌రెడ్డి

నల్సార్‌లో ఏఐపై న్యాయ సదస్సు

మూడుచింతలపల్లి, ఆగస్టు 10: నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా సహకారంతో 'కృత్రిమ మేధస్సు-ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-చట్టం, న్యాయం' అనే అంశాలపై శనివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలో గల నల్సార్ యూనివర్సిటీలో ఒక రోజు సదస్సు నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో నల్సార్ యూనివర్సిటీ, లా కమిషన్ ఆఫ్ ఇండియా సహకారంతో సదస్సు కొనసాగింది. లా కమిషన్ ఆఫ్ ఇండియా మెంబర్-సెక్రటరీ రీటా వశిష్ట్, ఇతర వక్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అభివృద్ధి చెందుతున్న శాస్త్ర,సాంకేతిక పరిణామాలతో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు చట్టానికి, న్యాయ వ్యవస్థకు మధ్య ఎలాంటి సంబంధం ఉండాలి?' అనే అంశాలపై చర్చించారు. ప్రభుత్వ విభాగాలు, విద్యా సంస్థలు న్యాయ సాంకేతిక, పారిశ్రామిక రంగ నిపుణులు సమావేశంలో తమ అభిప్రాయాలను వెల్లడించారు. దేశ న్యాయ వ్యవస్థలో వ్యాజ్యాలను తీర్చేందుకు, ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు ఇప్పటికే 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' సాంకేతికతను వాడుకుంటోందని వక్తలన్నారు. సుప్రీం కోర్టు ఏఐ సదుపాయం కల్పించిన న్యాయస్థానాల పని సామర్థ్యాన్ని పెంచేందుకు ఆధునికీకరణ ఫేజ్-3లో ఏఐ ఆధారిత సాధనాలను అనుసంధానం చేసింది. ఈ సందర్భంగా నల్సార్ వైస్ చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు మాట్లాడుతూ.. ఈ సమావేశం రెండు సెషన్లు జరిగిందన్నారు. కార్యక్రమంలో నాస్‌కామ్ మాజీ డైరెక్టర్ బీవీఆర్.మోహన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగ ఎమర్జింగ్ టెక్నాలజీ డైరెక్టర్ రమాదేవి, న్యాయ వ్యవస్థ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న వక్త



తలకొండపల్లి-మిడ్జిల్ రహదారిపై నిరసన చేస్తున్న బీజేపీ నాయకులు

రోడ్డు పనులు పూర్తి చేయాలి

తలకొండపల్లి, ఆగస్టు 10: తలకొండపల్లి-మిడ్జిల్ ప్రధాన రహదారిపై బ్రిడ్జిల వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు వెంటనే పూర్తిచేసి రాకపోకలకు ఇబ్బందులు తీర్చాలని కోరుతూ శనివారం బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పనుల నిర్వహణ విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ప్రధాన రహదారిపై కొద్దిసేపు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పద్మ అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పలువురు బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులు చేపట్టి పదేళ్లు కావోస్తున్నా నేటికీ అసంపూర్తిగానే నిలిచిపోయాయని తెలిపారు. అసంపూర్తి పనులను పూర్తి చేయాలని అనేకమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని అనిల్ ఆవేదన వ్యక్తం చేశారు. పాడైన రోడ్డు మూలంగా వాహనదారులు అనేక మంది ప్రమాదాలకు గురయ్యారని తెలిపారు. అసంపూర్తి పనులు వెంటనే చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చకపోతే బీజేవైఎం ఆధ్వర్యంలో పోరాట కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కుమార్‌గౌడ్, గణేశ్, మహేశ్, మనోహర్, శ్రీశైలం, శంకర్, రవి, చందు, మల్లేశ్, రంగయ్య, రాజు, మధు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల విషయంలో రాజీపడొద్దు

రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు



పోలీసులకు సూచనలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 10: శాంతిభద్రతల విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడకూడదని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. శనివారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులతో సీపీ మాట్లాడుతూ బాధితులెవరైనా స్టేషన్‌కు వస్తే సమస్యలేంటనేది తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు. మహిళల భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రిసెప్షన్ మొదలు పెట్రోలింగ్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన ఎవరికివారు విధుల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ అంటే ప్రజలతో మమేకవడమేనని ఆయన అన్నారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. రోడ్డుపై వాహనాలు నిలిపితే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



నడిరోడ్డుపై మురుగు

మొయినాబాద్, ఆగస్టు 10: చిన్నపాటి వర్షం కురిస్తేచాలు హిమాయత్ నగర్ కుమ్మరి బస్తీ ప్రధాన రోడ్డుపై వర్షపు నీటితో పాటు అండర్ డ్రైనేజీ మురుగు పరుగు తీస్తోంది. దాంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. చిలుకూరు బాలాజీ ఆలయానికి వెళ్లే భక్తులు, వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. చిన్నపాటి వానపడితే డ్రైనేజీ నీరు రోడ్డుపై పరుగులు తీస్తోంది. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్తులు పంచాయతీ అధికారులను కోరుతున్నారు. అంతేకాకుండా చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయకుండా నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు శంకర్, నవీన్‌రెడ్డి
- నందిగామ మండలం చేగూర్‌లో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



వాలీబాల్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్

నందిగామ, ఆగస్టు 10: గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయిలో రాణించాలని, క్రీడలతో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ధృడత్వం కలుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం నందిగామ మండల పరిధిలోని చేగూర్‌లో బంటారం మల్లేష్‌తో పాటు గ్రామ యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మామిళ్ల విఠల్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువు, క్రీడల్లో రాణించాలన్నారు. నవీన్‌రెడ్డి మాట్లాడుతూ యువకులు క్రీడారంగంలో గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయికి ఎదగాలన్నారు. వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తూ.. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న బంటారం మల్లేష్‌గౌడ్‌ను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అభినందించారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులతో కాసేపు వాలీబాల్ ఆడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో నాయకులు జంగ నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్ గొర్లపల్లి అశోక్, కొమ్ము కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, కావలి కృష్ణ, శ్రీశైలం, సాములయ్య, శివ, కుమార్, సురేష్, శేఖర్, క్రీడాకారులు పాల్గొన్నారు.



హిమాయత్ నగర్‌లో ఇంటికి అనుకొని ఉన్న విద్యుత్ స్తంభం

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

మొయినాబాద్, ఆగస్టు 10: మండల పరిధిలో గల హిమాయత్ నగర్‌లోని చాకలి బస్తీలో ఓ ఇంటి అనుకొని విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. దాంతో ఇంటికి నిత్యం ఎర్తింగ్ వస్తుందని తెలిసి యాజమాని పెండ్యాల సాయికుమార్ భయందోళనకు గురవుతున్నాడు. స్తంభాన్ని తొలగించాలని గ్రామ పంచాయతీ, విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో ఇంటిని ఖాళీ చేసి వేరే ఇంట్లో అద్దెకు దిగాడు. విద్యుత్ శాఖ అధికారులకు, గ్రామపంచాయతీ కార్యదర్శికి కూడా వినతిపత్రం అందజేసినా స్పందించడం లేదని సాయికుమార్ అవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఉన్నతాధికారులు స్పందించి స్తంభాన్ని తొలగించి సమస్యను పరిష్కారించాలని కోరుతున్నాడు.

నేడు చేవెళ్లలో రక్తదాన శిబిరం

చేవెళ్ల, ఆగస్టు 10 : నేడు(ఆదివారం) చేవెళ్లలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు పర్యావరణ అవార్డు గ్రహీత రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ ఆసుపత్రి సౌజన్యంతో చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల యువకులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాల్సిందిగా ఆయన కోరారు.

ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు

- ఆర్ట్ ఫౌండేషన్ అధినేత్రి డాక్టర్ అనితా హరినాథ్‌రెడ్డి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న అనితారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 10 : ఆరోగ్యానికి మించిన ఆస్తి మరొకటి లేదని, ఆరోగ్యంగా ఉంటే ఆస్తులు ఎన్నో సంపాదించుకోవచ్చని, ప్రతీ ఒక్కరు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగపర్చుకోవాలని ఆర్ట్ ఫౌండేషన్ అధినేత్రి డాక్టర్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని చిన్నతూప్ర గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా హాజరైన వారందరికీ వైద్య పరీక్షలు చేసిన అనంతరం ఉచితంగా మందులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేద ప్రజలు అనేక రకాల వ్యాధులతో బాదపడుతుంటారని, వైద్య పరీక్షలు చేయించుకునేందుకు నగరంలోని కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లలేక అనేక రకాలుగా ఇబ్బందులు పడుతుంటారని, ఇలాంటి సమయంలో ఉచిత వైద్య శిబిరాలు ఎంతో దోహదపడుతాయన్నారు. పేదలను ఆరోగ్యంగా ఆదుకునేందుకు ఆర్ట్ ఫౌండేషన్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. 200 మందికి పైగా హాజరై వైద్య పరీక్షలు చేయించుకొన్నారని, వారందరికీ మందులను పంపిణీ చేశామని అనితారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు విజయరంగ, నరేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తొండుపల్లి ఫ్లైఓవర్ పనులు చేపట్టాలి



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 10 : మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి ఫ్లైఓవర్ పనులు వెంటనే చేపట్టాలని శనివారం బీజేపీ నాయకులు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. పనుల్లో జాప్యంపై నిరసిస్తూ ఎంపీకి సమస్యలు విన్నవించగా.. స్పందించిన ఎంపీ త్వరలోనే పనులను పరిశీలించి కాంట్రాక్టర్, నేషనల్ హైవే అథారిటీ అధికారులతో మాట్లాడుతానని చెప్పినట్లు బీజేపీ నాయకుడు పరమేష్‌గౌడ్ తెలిపారు. కొన్ని సంవత్సరాల నుంచి ఫ్లైఓవర్ పనులు నెమ్మదిగా జరుగుతుండటంతో వాహనాదారులు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఎన్‌హెచ్‌ఏ అధికారులు, కాంట్రాక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఎంపీ దృష్టికి తీసుకెళ్లినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

భట్టిని కలిసిన మోత్యానాయక్



కడ్తాల్, ఆగస్టు 10: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేపావత్ మోత్యానాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుపతి వెళ్తున్న భట్టిని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరగా సానుకూలనంగా స్పందించినట్లు తెలిపారు.

మంత్రి జూపల్లికి నాయకుల శుభాకాంక్షలు



మంత్రి జూపల్లి కృష్ణారావు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏనుగు జంగారెడ్డి, రాకేష్‌గౌడ్

కందుకూరు, ఆగస్టు 10: ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకలు శనివారం ఆయన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో శనివారం మండల కాంగ్రెస్ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, నాయకులు రాకేష్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నగరశివారులోని అత్తాపురంలో ఉన్న మంత్రి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గౌడన్నల అభ్యున్నతికి కృషి

షాబాద్, ఆగస్టు 10 : గౌడన్నల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడిగా ఎన్నికైన గంగాపురం మల్లేష్‌గౌడ్ అన్నారు. గౌడ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రేనట్ల మల్లేష్‌గౌడ్ చేతుల మీదుగా శనివారం సమితి మండల అధ్యక్ష నయామక పత్రాన్ని ఆయన అందుకున్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులకు మల్లేష్ కృతజ్ఞతలు తెలిపారు.



నియామక పత్రం అందుకుంటున్న మల్లేష్‌గౌడ్

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



బాలకృష్ణకు నియమాకపత్రాన్ని అందజేస్తున్న కంజర్ల ప్రకాష్, జ్ఞానేశ్వర్

మొయినాబాద్, ఆగస్టు 10: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నాయకులు ప్రజాప్రతినిధులుగా పోటీ చేసి గెలిచేందుకు కార్యకర్తలు, నాయకులు పార్టీ బలోపేతానికి ఇప్పటి నుంచే కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్‌లు పిలుపునిచ్చారు. మండల పరిధి అజీజ్‌నగర్ గ్రామానికి చెందిన అంతంగారి బాలకృష్ణను బీజేపీ ఎస్సీ మోర్చా కార్యాలయం కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈమేరకు శనివారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ పార్టీ కార్యాలయంలో ఆయనకు కంజర్ల ప్రకాష్, బంటు జ్ఞానేశ్వర్‌లు నియమాక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తూర్పు మాధవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, గోపాల్‌రెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

చేవెళ్ల, ఆగస్టు 10 : ప్రజాసేవకే తన జీవితం అంకితం చేస్తామని చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహం విద్యార్థులకు ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు ప్రజాసేవ చేసేందుకు ముందుకు సాగుతామన్నారు. ప్రభుత్వ వసతి గృహల్లో ఉండే పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, మండల కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు దేవర సమతారెడ్డి, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

సీఎం సహాయనిధి.. పేదలకు వరం

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్, ఆగస్టు 10 : సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీలోని సిద్ధాంతిబస్తీకి చెందిన పి.వెంకటేష్ ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం సహాయం కావాలని సీఎం పేషీకి అర్జీ పెట్టుకోగా.. రూ.29.500 మంజూరయ్యాయి. ఈమేరకు చెక్కును శనివారం దుర్గానగర్‌లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆయన నివాసంలో అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి వైస్ చైర్మన్ బండిగోపాల్‌యాదవ్ కౌన్సిలర్‌లు మేకల వెంకటేష్ భద్రూనాయక్ స్థానిక నాయకులు దూడల వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణజ్యోతి ఆరాధన పూజలు



పూజల్లో భక్తులు మహిళా భక్తులు

ఆమనగల్లు, ఆగస్టు 10: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం శ్రావణజ్యోతి ఆరాధన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ మాసం నేపథ్యంలో నిర్వహించిన పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయ ప్రధాన అర్చకుడు, నిర్వాహకుడు గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పూజలు కొనసాగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణ శనివారం నేపథ్యంలో ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని పలు దేవాలయాలలో కూడా పూజలు నిర్వహించారు.

బోనాల వేడుకలకు పెద్దఎత్తున ఏర్పాట్లు

కడ్తాల్, ఆగస్టు 10: మండల కేంద్రంలో ఈనెల 24 నుంచి 27 వరకు బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పోచమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సత్యం యాదవ్ తెలిపారు. నాలుగు రోజుల వేడుకలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. మండల కేంద్రంలోని పోచమ్మ దేవాలయం వద్ద వేడుకలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, కులసంఘాల నేతలు పాల్గొన్నారు. వేడుకలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు గంప వెంకటయ్య, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, పాలాది ఆంజనేయులు, యాట నర్సింహ, తదితరులున్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి



విరాళం అందిస్తున్న బీజేపీ నాయకుడు అనంత్‌రెడ్డి

చేవెళ్ల, ఆగస్టు 10 : ఆలయం అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని అల్లవాడ మాజీ ఎంపీటీసీ కమ్మరి సత్యనారాయణచారి తెలిపారు. శనివారం బీజేపీ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి పామెన గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వీరభద్రస్వామి దేవాలయం నిర్మాణం కోసం నిర్వాహకులకు రూ.51వేలు విరాళముగా అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చిన తోచిన సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు కొయ్యడ రాములు, కొమురయ్య, దావల్‌గారి నరేందర్‌రెడ్డి, టి.గురోత్తం, రాజుగౌడ్, విజయ్‌కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్ల ఏర్పాటును అడ్డుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు

మొయినాబాద్, ఆగస్టు 10: నగర శివారు మొయినాబాద్‌లో కార్పొరేట్ సెలూన్ల ఏర్పాటును అడ్డుకోవాలని, నాయీ బ్రాహ్మణులంతా ఐక్యంగా ఉండాలని మండల నాయీ బ్రాహ్మణుల సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో శనివారం నిర్వహించిన మండలస్థాయి నాయీ బ్రాహ్మణుల సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. గ్రామీణ ప్రాంతంలో నాయీ బ్రాహ్మణులకు ఎంతో ప్రాముఖ్యత ఉందని.. పట్టణం నుంచి వచ్చేవారికి ప్రాధాన్యత ఈ మధ్య ఎక్కువైందని విమర్శించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ప్రత్యేక పేర్లతో సెలూన్‌లను ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఐక్యంగా ఉండి కార్పొరేట్ శక్తులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారిని అడ్డుకుంటామని నాయకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అజీజ్‌నగర్ మాజీ సర్పంచ్ మంగలి మంగ రాములు, మీదింటి శ్రీనివాస్, నర్సింహ, హిమాయత్‌నగర్ వేణు, పసుపుల నర్సింహ, రాజు, నరేందర్, మల్లేష్, వెంకటస్వామి, నరసింహ్మ, శ్రీనివాస్, శ్రీకాంత్ పాండు తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు సమాయత్తం కావాలి

ఆమనగల్లు, ఆగస్టు 10: రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్ పిలుపునిచ్చారు. హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలోని భవాని గార్డెన్‌లో శనివారం ఆమనగల్లు మండల, మున్సిపాలిటీ బీజేపీ కార్యకర్తల విస్తృతసమావేశం నిర్వహించారు. బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, మండల ప్రధాన కార్యదర్శి ఎర్రవోలు శ్రీనుల అధ్యక్షతన జరిగిన సమావేశానికి హరిప్రసాద్, మహబూబ్‌నగర్ పార్లమెంట్ కో-కన్వీనర్ నర్సింహగౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో పార్టీ బలోపేతం, స్థానిక సమస్యలు, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం గురించి చర్చించారు. హరిప్రసాద్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది నెలలైనా అమలు చేయకుండా ప్రజలను మోసగించిందని ఆరోపించారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం అమలులో కాంగ్రెస్ విఫలమైందని, కొత్త పింఛన్ల ఊసెత్తడం లేదని మండిపడ్డారు. మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, నాయకులు చెన్నకేశవులు, లక్ష్మణ్, బుచ్చయ్య, విజయ్‌కృష్ణ, దుడ్డు కృష్ణ, గాజుల మల్లయ్య, లండం కృష్ణయ్య, భగవాన్ రెడ్డి, శ్రీధర్, సాయి, రవి రాథోడ్, కేకే శ్రీను, తదితరులున్నారు.



మాట్లాడుతున్న కండె హరిప్రసాద్

పంద్రాగష్టున ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగరేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న పోరెడ్డి నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 10: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈనెల 15న ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగరవేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోరెడ్డి నర్సింహారెడ్డి అన్నారు. శనివారం జరిగిన ఇబ్రహీంపట్నం బీజేపీ మండల, మున్సిపల్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఎక్కువ సంఖ్యలో గెలిపించుకునేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. బీజేపీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందని సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలన్నారు. నాయకులు బోసుపల్లి ప్రతాప్, నాయిని సత్యనారాయణ, జక్క రవీందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు శ్రీశైలం, మున్సిపల్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు కె.శ్వేత తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

కడ్తాల్ : అధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం పొందవచ్చునని మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. అన్మాస్‌పల్లి శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం క్యాతిక లక్ష్మమ్మ పర్వతాలు, అమూల్య రవికుమార్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. దశరథ్ నాయక్, ఫిరమిడ్‌ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

కడ్తాల్ : సేవాలాల్ సేన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కడ్తాల మండలం చిన్న వేములోని బావితండాకు చెందిన దేపావత్ పత్యానాయక్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్ పత్యానాయక్‌కు నియామకపత్రం అందజేశారు.

తలకొండపల్లి : వెల్జాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అజీజ్, నర్సింహ, రవి, సువర్ణ, సుజాత, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : మండల కేంద్రానికి చెందిన దాసరి అంజమ్మ శనివారం మృతి చెందింది. నిరుపేద కావడంతో మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి రూ.5వేలు, భారత్ గ్యాస్ డీలర్ రమణగౌడ్ రూ.5వేలు, తలసాని పవన్‌కుమార్ రెడ్డి రూ.3వేలు మృతురాలి కుటుంబ సభ్యులకు అందించారు.

ప్రజాపాలనపై విషం కక్కుతున్న బీఆర్ఎస్ నేతలు



కసిరెడ్డిని సన్మానిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

తలకొండపల్లి, ఆగస్టు 10: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా పాలనను చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నేతలు ప్రతీది రాజకీయం చేస్తూ విషం కక్కుతున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులు అమెరికాకు వెళితే దానిని రాజకీయం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తలకొండపల్లి మండలంలో శనివారం నారాయణరెడ్డి విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి సునిత దంపతులు, డోకూరు మాదేశ్ రెడ్డి, డోకూరు స్వదేశ్‌రెడ్డిలు ఎమ్మెల్యేను సత్కరించి అభినందించారు. దేవుని పడకల్ గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించాలని గ్రామ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం, కాంగ్రెస్ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ పెళ్లికి చేయూత

షాబాద్, ఆగస్టు 10 : ఆడబిడ్డ ఇంటికి మహాలక్ష్మితో సమానమని మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు చాంద్ పాషా అన్నారు. శనివారం మండల పరిధిలోని హైతాబాద్‌లో ఓ ఆడబిడ్డ పెళ్లి కోసం ఆమె తల్లిదండ్రులకు తమ వంతు సాయంగా రూ.11వేల ఆర్థిక సాయం అందజేశారు. హైతాబాద్ గ్రామస్థులకు సుమారు 51మంది ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం అందజేశానని ఆయన తెలిపారు. సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యాదయ్య, మాజీ సర్పంచులు దర్శన్, శేఖర్, నాయకులున్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న చాంద్‌పాషా తదితరులు

సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతల ఆర్థిక సాయం



హెచ్‌ఎంకు చెక్కును అందజేస్తున్న దాతలు

చేవెళ్ల, ఆగస్టు 10 : ప్రభుత్వ పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని చేవెళ్ల ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖాజాపాషా తెలిపారు. శనివారం చేవెళ్ల గ్రామానికి చెందిన గుడిపల్లి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌లు కలిసి చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.45 వేల ఆర్థిక సాయం చేస్తూ చెక్కును ప్రధానోపాధ్యాయుడు ఖాజాపాషాకు అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డి, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.